క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకారం తీసుకోవాలి



పంచాయతీ పాలకవర్గ సభ్యుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు

కాజులూరు: ప్రజల సహకారంతోనే నాయకులు పూర్తి స్థాయిలో గ్రామాభివృద్ధి సాధించగలుగుతారని ఎంపీడీఓ జె.రాంబాబు అన్నారు. కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో రెండు రోజుల పాటు జరుగనున్న పంచాయతీ పాలకవర్గ సభ్యుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీఓ రాంబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమంలోనూ ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. తద్వారా ప్రజలు బాధ్యతగా మెలిగి గ్రామాభివృద్ధిలో నాయకులకు సహకరిస్తారన్నారు. అనంతరం ఆర్యావటం గ్రామ కార్యదర్శి సూరిబాబు తదితరులు కేంద్ర ప్రభుత్వం ద్వారా పంచాయతీల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల విడుదల తదితర అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ శీలం వారి సావరం, ముచ్చిమిల్లి ఫీడర్లలో అత్యవసర మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఈఈ కె.రత్నాలరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 08.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలోని శీలం వారి సావరం, వైఎస్సార్ నగర్, రాజబాబు నగర్, గణేష్ నగర్, రాజగోపాల్ సెంటర్, ద్రాక్షారామ రోడ్డు, ఆర్టోస్ ఫ్యాక్టరీ, బీర్ ఫ్యాక్టరీ, వెల్ల వాటర్ వర్క్స్, సాయినగర్, శాంతినగర్, డీఎస్పీ ఆఫీస్, ఫైర్ స్టేషన్, బ్రాడీపేట, శ్రీరాంపేట, గంగుమళ్ల వారి వీధి, వాడపల్లి వారి వీధి, పెట్రోల్ బంక్ బ్యాక్ సైడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని ఈఈ విజ్ఞప్తి చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి



కాజులూరు సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కాజులూరు: నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని కాజులూరు తిప్పరాజుపాలెం, చేదువాడ, బందనపూడి తదితర గ్రామాల్లో 'మన ఊరు, మన సుభాష్' కార్యక్రమంలో భాగంగా సోమవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పర్యటించారు. కాజులూరులో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రాధాన్యత ప్రకారం వాటిని పరిష్కరించేందుకు 'మన ఊరు, మన సుభాష్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గత కొన్నాళ్లుగా తీవ్ర సమస్యాత్మకంగా మారిన గొల్లపాలెం, కుయ్యేరు రహదారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, మండల జనసేన అధ్యక్షుడు బొండా వెంకన్న, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌ను కలసిన డీఎస్‌వో

రామచంద్రపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎస్ఓగా అడపా ఉదయభాస్కర్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం రామచంద్రపురంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

చిత్రకళా గురువుకు సత్కారం



త్రినాథి ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయుడు రాయుడు త్రినాథి ప్రసాద్ సోమవారం ఘన సత్కారం అందుకున్నారు. కోనసీమ కళాపీఠం నిర్వాహణలో డాక్టర్ ఉండ్రు ఆశీర్వాదం ఆధ్వర్యంలో అమలాపురంలో చిత్రకళా గురువుల గురుపూజోత్సవం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చిత్రకళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. త్రినాథి ప్రసాద్‌ను సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

కూటమి పాలనలో వ్యవస్థలకు తూట్లు

- సచివాలయాల్లో సేవల కుదింపు
- స్థానికంగానే రిజిస్ట్రేషన్ చేసే వ్యవస్థ రద్దు
- వేలాది పట్టాలు రిజిస్ట్రేషన్ చేసిన జగన్ ప్రభుత్వం
- రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతికి అవకాశం



2023 మార్చి 25న అంగర సచివాలయం వద్ద ఇళ్ల పట్టాదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ ఏఈ (ఫైల్)

కపిలేశ్వరపురం: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిని నిరోధించడానికి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియలోని జాప్యాన్ని నివారించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్త బలమైన వ్యవస్థను తీసుకొచ్చింది. స్థానిక సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసే ఆలోచన చేసి అందుకోసం తగిన సదుపాయాలు కల్పించింది. వీఆర్వో, కార్యదర్శి, తదితర సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. తొలి ప్రయత్నంగా జగనన్న కాలనీల లబ్ధిదారులకు 12 రోజుల్లో ఇళ్ల పట్టాను రిజిస్ట్రేషన్ చేసి చేతికందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిది. పేదలకు మేలు చేసేందుకు ప్రత్యేక వ్యవస్థలు సృష్టించిన పాలన వైఎస్ జగన్ ప్రభుత్వానిది. అలాంటి మహోన్నతమైన లక్ష్యానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచింది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల వ్యవస్థను రద్దు చేసింది.

నేపథ్యమిదీ

2023 జనవరి 24, 25 తేదీల్లో సంబంధిత సచివాలయ ఉద్యోగులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఫిబ్రవరిలో జగనన్న కాలనీ లబ్ధిదారులకు పట్టాలను రిజిస్ట్రేషన్లు చేసి ఇచ్చింది. 2023 జూలైలో వివిధ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను నిర్వహించే దిశగా అడుగులు వేసింది. అందుకు తగిన ప్రింటర్లు, వెబ్ కెమెరా తదితర సాంకేతిక పరికరాలను సమకూర్చింది. మండలాలవారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించి పర్యవేక్షణ చేసింది. జగనన్న శాశ్వత గృహ హక్కు పథకంలో ఓటీఎస్‌కు ముందుకొచ్చే వారికి ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసి యాజమాన్య హక్కులు కల్పించడం భూహక్కులు, భరత్లలో రీసర్వే చేసి రైతు భూమికి హక్కు పత్రాలు అందించడం చేస్తున్నట్టుగానే రిజిస్ట్రేషన్లు సైతం సచివాలయాల్లోనే చేసే నిర్ణయాన్ని యావత్ ప్రజానీకం స్వాగతించింది.

ఎంపిక చేసిన సచివాలయాలు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 25 చొప్పున సచివాలయాలను రిజిస్ట్రేషన్లకు అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంపిక చేసింది. సిబ్బంది శిక్షణ అనంతరం సుమారు 13 సచివాలయాల్లో వివిధ రకాల రిజిస్ట్రేషన్లను సైతం చేశారు. రామచంద్రపురం మండలంలో ఏరుపల్లి, తోటపేట, ఉండూరు, కాపవరం, కందులపాలెం, హసన్‌బాద, కె.గంగవరం మండలంలోని యండగండి పామర్రు, అముజూరు, పాణింగిపల్లి, సత్యవాడ, తామరపల్లి, కె.గంగవరం, కుందూరు, ఎర్ర పోతవరం, విలాస గంగవరం, అద్దంపల్లి, కుడుపూరు, గుడిగళ్ల, బాలాంత్రం, కూళ్ల, సుందరపల్లి, ఊడిపూడి, శివల సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండపేట నియోజకవర్గంలోని మండపేట మండలంలో మెర్నిపాడు, చినద్వారపూడి, ఇప్పనపాడు, మారేడుబాక, వెలగతోడు, పాలతోడు, ద్వారపూడి, రాయవరం మండలంలోని లొల్ల, వెదురుపాక, నదురుబాద, పసలపూడి, సోమేశ్వరం, మాచవరం, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి, కపిలేశ్వరపురం మండలంలోని నేలటూరు, వల్లూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, కాలేరు, నల్లూరు, వెదురుమూడి, పడమరఖండ్రిక, వాకతిప్ప గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ఏర్పాటు చేశారు.

జగనన్న కాలనీ లబ్ధిదారులకు మేలు

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసే వ్యవస్థను వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకు రావడంతో జగనన్న కాలనీ లబ్ధిదారులకు మేలు జరిగింది. జగనన్న ఇచ్చిన ఇంటి పట్టాను రిజిస్ట్రేషన్ చేసి అక్కచెల్లెమ్మల చేతికి అందించింది. ఆ బాధ్యతను సచివాలయాల పరిధిలోని వీఆర్వోలకు అప్పగించింది. లబ్ధిదారులను మ్యాపింగ్ చేసి, ఇళ్ల స్థలాలకు బౌండరీలను నిర్ధారించి సంబంధించిన కొలమానాలు మేరకు పట్టాను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. మండలాలవారీగా మండపేటలో 5,240, రాయవరంలో 2,143, కపిలేశ్వరపురంలో 1,753, రామచంద్రపురంలో 6,395, కె.గంగవరంలో 2,089, కాజులూరులో 1838 మొత్తం 19,458 మంది పట్టాలు రిజిస్ట్రేషన్లు చేసే దిశగా ఆనాటి ప్రభుత్వం విశేషంగా కృషి చేసింది.

సాంకేతిక కారణాలతో రద్దు

గొప్ప వ్యవస్థకు శ్రీకారం చుట్టినపుడు ఆ వ్యవస్థ బలపడేందుకు కొంత సమయం పడుతుంది. రోజు రోజుకూ ఆచరణాత్మక అనుభవాలతో వ్యవస్థ మరింత బలపడుతుంది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల వ్యవస్థ సుదీర్ఘ లక్ష్యానికి సంబంధించినది. పలు శాఖల పరిధిలోని అంశాలు ఏకీకృతం కావాల్సిన అవసరం ఉంది. అంతటి గొప్ప వ్యవస్థను ఆదిలో ఎదురైన బాలారిష్టాలను సాకుగా చూపుతూ కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. వ్యవస్థను మరింత బలపరిచి, సామాన్యుల చెంతకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను తీసుకురావడానికి బదులు రద్దు చేయడంపై సర్వత్రా అసహనం వ్యక్తమవుతుంది.

పలువురు అధికారులు బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ పద్మజ్యోతికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: ఎంపీడీఓగా కె.రత్నకుమారి నియమితులయ్యారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. కడియం ఎంపీడీఓగా పని చేస్తూ బదిలీపై ఆమె కపిలేశ్వరపురం వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన కొండలరావు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలానికి బదిలీపై వెళ్లారు. ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఎంపీడీఓ రత్నకుమారిని మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.



రత్నకుమారి



రాజేంద్ర ప్రసాద్

ఏఓగా రాజేంద్రప్రసాద్

మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారిగా జి.రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. రావులపాలెం ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా పని చేస్తూ బదిలీపై ఆయన కపిలేశ్వరపురం వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఏఓగా పనిచేసిన ఎంవీ ప్రకాశ్ ఆలమూరు ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా బదిలీపై వెళ్లారు. అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని రాజేంద్రప్రసాద్ అన్నారు.

ఎంపీడీవోగా పద్మజ్యోతి

రామచంద్రపురం రూరల్: మండలం ఎంపీడీవోగా కడలి పద్మజ్యోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గోకవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎస్.కీర్తి స్పందన రాయవరం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఎంపీడీఓ పద్మజ్యోతిని ఏవో చాగంటి వెంకటఅచ్యుత రామ సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ ఎస్.సెలత్ రాజు, ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి స్వాగతం పలికారు.



నాగనటరాజ్‌గోపాల్

మండల పరిషత్ ఏవోగా గోపాల్

రాయవరం: మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి (ఏవో)గా యామజాల నాగనటరాజ్ గోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న గోపాల్ బదిలీపై రాయవరం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న డి.శ్రీనివాస్ బదిలీపై గోకవరం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లారు.

పాలనపై స్పష్టమైన అవగాహన అవసరం

- ఎంపీపీ నౌడు వెంకటరమణ
- ఉప సర్పంచులు, వార్డు సభ్యుల అవగాహన సమావేశం ప్రారంభం



ఉప సర్పంచులు, వార్డు సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: గ్రామ పంచాయతీల పాలనపై ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు స్పష్టమైన అవగాహన అవసరమని, అప్పుడే వేగవంతమైన పాలన, మెరుగైన సేవలు అందించడానికి వీలవుతుందని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని ఉప సర్పంచ్‌లు, ఇరువురు వార్డు సభ్యులకు రెండు రోజుల అవగాహనా సమావేశాలు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశాలను ప్రారంభించిన అనంతరం ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామీణులకు మెరుగైన పాలన అందించాలంటే పంచాయతీల్లో జరిగే ప్రతి కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పంచాయతీ నుంచి ఉప సర్పంచ్‌తో పాటుగా, ఒక పురుషుడు, ఒక మహిళా వార్డు సభ్యులకు రెండు రోజుల రీఫ్రెషర్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం- 1994 ప్రకారం ఈ శిక్షణ అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీ సమావేశాలు, గ్రామసభల నిర్వహణ, పంచాయతీలకు ఉన్న తనిఖీ అధికారాలు, చెల్లింపు విధి విధానాలు, పారిశుధ్యం, ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ, సొంత ఆదాయ వనరులు, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, పంచాయతీల్లో ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, భవన నిర్మాణ అనుమతులు, నిబంధనలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు, న్యాయ విజ్ఞానం, పంచాయతీల ఆస్తులు, వాటి పరిరక్షణ తదితర అంశాలపై రెండు రోజుల శిక్షణలో వారికి అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. మంగళవారం సాయంత్రం రెండు రోజుల శిక్షణ ముగిస్తామన్నారు. శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భీమశంకరం



రామచంద్రపురం: రంపచోడవరంలో ఈనెల 3న జరిగిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంటపల్లి భీమశంకరం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బత్తుల సిద్ధూ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమశంకరం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రచయితలు, కవులు, జర్నలిస్టులు, కళాకారులపై నిర్బంధ హింసను ప్రయోగిస్తున్నారని, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే ప్రజా పోరాటాల్లో అరుణోదయ సంస్థ కళాకారులు విలువైన పాత్ర పోషిస్తూ అరుణోదయ సంస్థను మరింతగా ప్రజానీకంలోకి తీసుకువెళతామని వారు పేర్కొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తోట



కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరు రోడ్డులోని జోడు తూముల వద్ద వేంచేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం దర్శించుకున్నారు. చెరుకుపల్లి గణేష్‌శర్మ నేతృత్వంలో అర్చకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నేతృత్వంలో త్రిమూర్తులను దుశ్శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు.

ఆర్డీవోగా ఖాతీబ్ కౌసర్ బానో



రామచంద్రపురం: రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అధికారిగా ఖాతీబ్ కౌసర్ బానో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్.సుధాసాగర్ అమరావతిలోని జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించడంతో ఆయన రిలీవ్ అయ్యారు. కాగా ఖాతీబ్ కౌసర్ వైఎస్సార్ కడప జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో ఖాతీబ్ కౌసర్ బానోను జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.బాపూజీ, వీఆర్వోల సంఘం నాయకులు, వీఆర్వోలు, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, రెవెన్యూ శాఖ ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

చిత్తశుద్ధితో పని చేసినవారికి గుర్తింపు



బదిలీ అయిన అధికారులతో ఎంపీడీఓ రత్నకుమారి, సహచర అధికారులు

కపిలేశ్వరపురం: ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పని చేసినవారికి సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని ఎంపీడీఓ కె.రత్నకుమారి అన్నారు. ఇటీవల బదిలీ అయిన మండల పరిషత్, పలు పంచాయతీల అధికారులను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సహచర అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లిన కార్యాలయ ఏఓ ఎంవీఎం ప్రకాశ్, పలు పంచాయతీల కార్యదర్శులు సీహెచ్‌వీవీ నరసింహారావు, టి.శుభాకర్, కె. రామకృష్ణ, ఎస్.సుధారాణి, సాకా రామకృష్ణ, పి.వెంకటేశులు, వీడీవీలక్ష్మి, ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగి కమిడి నాగేశ్వరరావులను సత్కరించారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి

కాజులూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపైనా ఉందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దూడల శంకరనారాయణ అన్నారు. మండల గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దుగ్గుదుర్రులో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పంపన రాంబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంకరనారాయణ పాల్గొని సభ్యత్వాల నమోదును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో పార్టీ కేంద్రంలో బలంగా ఉందన్నారు. కార్యకర్తలు మండల గ్రామాల్లో ఇంటింటా పర్యటించి గడచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై కరపత్రాలు, ఆటో ప్రచారం ద్వారా ప్రజలకు వివరిస్తూ ప్రతి ఒక్కరూ సభ్యత్వాలు స్వీకరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కండవల్లి చంద్రరావు, పిల్లి రామకృష్ణ, కండవల్లి ప్రదీప్ పాల్గొన్నారు.

మహో-చండీ పాహిమాం

- వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం
- భక్తిశ్రద్ధలతో భక్తుల పూజలు



కపిలేశ్వరపురంలో అమ్మవారి వేషధారణలో ఊరేగింపు

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని శరన్నవరాత్ర శిబిరాల్లో భక్తులు భక్తితో పరవశించారు. పుణ్యస్నానమాచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో అమ్మవారి మట్టి ప్రతిమకు మహాచండికాదేవి అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు విశేష పూజలు చేశారు. ఆదివారపుపేట ఆశ్రమంలో అమ్మవారి అలంకరణను, పూజలను భక్తులు తిలకించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పలు ఆధ్యాత్మిక ప్రసంగ కార్యక్రమాలను నిర్వహించారు.

స్కందమాతగా కనకదుర్గమ్మ

రామచంద్రపురం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అయిదో రోజు సోమవారం నాడు పట్టణంలోని కొత్తూరు జోడు తూముల వద్ద ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. చెరుకుపల్లి గణేష్‌శర్మ నేతృత్వంలో అర్చకులు అమ్మవారిని స్కందమాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మహా చంద్రిక అలంకరణలో అమ్మవారు

కపిలేశ్వరపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం శరన్నవరాత్ర ఉత్సవాల శిబిరాల్లో అమ్మవారిని మహా చంద్రికగా అలంకరించారు. కపిలేశ్వరపురంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి వేషధారి విశేషంగా అలరించారు. తాతపూడి, అంగర, పడమరఖండ్రిక, వల్లూరు, వెదురుమూడి, నేలటూరు, వడ్లమూరు, నిడసనమెట్ట, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప,అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని భవానీ మాలధారులు ఉత్సవ శిబిరాల్లో పూజలు చేశారు. అర్చకుల వేద మంత్రాలతో భక్తులు పరవశించారు.



ఆదివారపుపేట ఆశ్రమంలో మహాచండికాదేవి అలంకరణలో అమ్మవారు



ద్రాక్షారామలో మాణిక్యాంబ అమ్మవారి విశేష అలంకరణ



కొత్తూరు రోడ్డులోని జోడు తూముల వద్ద స్కందమాతగా కనకదుర్గమ్మ



లలితాదేవిగా ద్రాక్షారామ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

అధికారుల ఫోన్ నంబర్లు

రాయవరం మండలం

తహసీల్దారు	9849903905
ఎంపీడీవో	9912191666
మండల విద్యాశాఖాధికారి1	9948523380
మండల విద్యాశాఖాధికారి2	7013074928
పోలీసు స్టేషన్	08857235333
సబ్‌ఇన్‌స్పెక్టరు	9440904843
రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు	8309351543, 7013003149
మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు	8501002004, 8639015670
మండల వ్యవసాయాధికారి	8886613579
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో	7702072648
డ్వాక్రా ఏపీఎం	9154081283
మండల ఇంజినీరింగ్ అధికారి	9502377535
విద్యుత్‌శాఖ ఏఈ	9440812651
హౌసింగ్ ఏఈ	7093930489
మండల పశువైద్యాధికారి	8074154935
ఉద్యానవన శాఖ అధికారి	8712625211
గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ	9100121182